## జీఎస్టీ వసూళ్లు 1.84 లక్షల కోట్లు

### గతంతో పోల్చితే ఫిబ్రవరిలో 9.1 శాతం వృద్ధి

న్యూఢిల్లీ, మార్చి 1: జీఎస్టీ వసూళ్లు మరోసారి భారీ స్థాయిలో నమోదయ్యాయి. ఫిబ్రవరి నెలలో రూ.1.84 లక్షల కోట్ల స్థూల జీఎస్టీ వసూలైనట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కిందటేడాది ఇదే నెలలో వసూలైన రూ.1.68 లక్షల కోట్లతో పోలిస్తే 9.1 శాతం చొప్పున పెరిగాయని తెలిపింది. దేశీయ వినిమయం పుంజుకోవడం, ఆర్థిక రంగం తిరిగి వృద్ధి బాట పట్టడం వల్లనే జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదవుతునాయని వెల్లడించింది. గత నెలలో వసూలైన రూ.1.84 లక్షల కోట్లలో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.35,204 కోట్లు, స్టేట్ జీఎస్టీ కింద రూ.43,704 కోట్లు, ఐజీఎస్టీ కింద రూ.90,870 కోట్లు, పరిహారం సెస్ రూపంలో రూ.13,868 కోట్లు వచ్చాయని పేర్కొంది. జీఎస్టీ వసూళ్లలో దేశీయంగా వచ్చిన ఆదాయం ఏడాది ప్రాతిపదికన 10.2 శాతం ఎగబాకి రూ.1.42 లక్షల కోట్లకు చేరుకోగా, దిగుమతి చేసుకునే వస్తువులపై విధించే పన్ను ద్వారా రూ.41,702 కోట్లు సమకూరాయి. అలాగే రూ.20,889 కోట్ల పన్నును రిఫండ్ రూపంలో చెల్లించింది. ప్రస్తుత సంవత్సరం తొలి నెల జనవరిలో రూ.1.96 లక్షల కోట్ల జీఎస్టీ వసూలయ్యాయి. దీనిపై ఈవై ట్యాక్స్ పార్టనర్ సౌరభ్ అగర్వాల్ మాట్లాడుతూ..దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందడానికి ఈ జీఎస్టీ వసూళ్లే నిదర్శణమని, అంతర్జాతీయ దేశాలు అనిశ్చిత పరిస్థితిలో ఉన్నప్పటికీ పన్ను వసూళ్లు ఇంచుమించు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకోవడం విశేషమన్నారు. హర్యానా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ర్టాల్లో జీఎస్టీ వసూళ్లు 10 శాతం నుంచి 20 శాతం వరకు అధికమవగా, అలాగే తెలంగాణతోపాటు గుజరాత్, అసోం, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ర్టాల్లో 1 శాతం నుంచి 4 శాతం వరకు పెరిగాయి.

# టెస్లాపై ఆశలు వదులుకున్నట్టేనా?

### తీవ్రంగా పోటీపడుతున్న వివిధ రాష్ర్టాలు

### పట్టించుకోని తెలంగాణ సర్కారు

### టెస్లా కోసం గతంలో కృషిచేసిన కేటీఆర్

టెస్లా కారుతో కేటీఆర్ (ఫైల్)

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా భారత్‌లో అడుగుపెడుతున్న నేపథ్యంలో ఆ పెట్టుబడిని రాబట్టేందుకు పలు రాష్ర్టాలు తీవ్రంగా పోటీ పడుతున్నాయి. ఉచిత భూములు, రకరకాల ప్రోత్సాహకాల ఆశ చూపడంతోపాటు తమ రాష్ట్రంలో ఉన్న అనుకూలతలను ఎత్తిచూపుతూ ఎలాగైన పరిశ్రమను దక్కించుకొనేందుకు ఎవరి మార్గాల్లో వారు ప్రయత్నిస్తున్నారు. ఈ పోటీలో తెలంగాణ రాష్ట్రం వెనుకబడిందా? అంటే అవుననే సమాధానం వస్తున్నది. టెస్లా ప్లాంటు కోసం రాష్ట్ర సర్కారు అవసరమైన మేరకు ప్రయత్నాలు చేయకపోవడమే ఈ వాదనలకు బలాన్ని చేకూర్చుతున్నది.

టెస్లా కంపెనీని ఆకర్షించేందుకు తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా ప్రయత్నిస్తుండగా, కర్ణాటక, తెలంగాణ సైతం రేసులో ఉన్నాయి. తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్‌లలో ఇప్పటికే అనేక ఆటోమొబైల్ పరిశ్రమలు కొనసాగుతుండటం వాటికి కలిసొచ్చే అంశం. ఇప్పటికే పలు ప్రముఖ కార్ల తయారీ కంపెనీలు ఈ రాష్ర్టాల్లో తమ పరిశ్రమలు స్థాపించి ఉత్పత్తులు చేస్తున్నాయి. కర్ణాటక, తెలంగాణ రాష్ర్టాలకు ఐటీ పరిశ్రమలు అధికంగా ఉండటం కొంత అనుకూలాంశం కాగా, ఈ రెండు కాంగ్రెస్ పాలిత రాష్ర్టాలు కావడం ప్రతికూలాంశమని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. పోటీలో ఉన్న రాష్ర్టాల్లో తెలంగాణ మినహా అన్నింటికీ ఓడరేవు ఉంది. దీంతో ఎగుమతి, దిగుమతులకు ఈ రాష్ర్టాలు అనుకూలంగా ఉన్నాయి. అన్నిటికి మించి మన రాష్ట్ర ప్రభుత్వం మొదట్లో టెస్లాతో సంప్రదింపులు జరిపినప్పటికీ అనంతరం ఆ ప్రయత్నాలను కొనసాగించకుండా వదిలేసిందని అంటున్నారు. ముఖ్యంగా ఓడరేవు లేకపోవడం, ఎన్డీఏ కూటమిలోని రాష్ర్టాలతో మనం పోటీ పడే అవకాశం లేదనే భావన ప్రభుత్వ వర్గాల్లో ఉన్నట్టు తెలిసింది.

ఇదిలావుండగా, దాదాపు నాలుగేండ్ల క్రితం టెస్లా కార్ల తయారీ కంపెనీ భారత్‌కు వస్తున్నట్టు సంకేతాలు వెలువడిన వెంటనే అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ దాన్ని తెలంగాణకు వచ్చే విధంగా తీవ్రంగా కృషిచేశారు. నిరంతరం కంపెనీ వర్గాలతో సంప్రదింపులు జరపడమే కాకుండా ఇతర రాష్ర్టాలను తలదన్నే విధంగా తాము ప్రోత్సాహకాలు ఇస్తామని కంపెనీ వర్గాలకు సమాచారం అందించారు. దీంతో తెలంగాణ గట్టి పోటీదారుగా ఎదగడమే కాకుండా టెస్లా భారత్‌కు వస్తే అది తెలంగాణలో ఏర్పాటు ఖాయమనే ప్రచారం అప్పట్లో జరిగింది. కానీ రాష్ట్రంలో ప్రభుత్వ మార్పుతో అంచనాలు తారుమారయ్యాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్‌తో సమావేశమైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సుంకాలతోపాటు పరిశ్రమ ఏర్పాటుకు కావాల్సిన సహకారంపై ఆయన లేవనెత్తిన అంశాలకు ప్రధాని సానుకూలంగా స్పందించడంతో టెస్లా కంపెనీ భారత్ రాకకు మార్గం సుగమమైంది. అంతేకాదు, ఇప్పటికే తమకు అవసరమైన ఉద్యోగుల నియామకం కూడా టెస్లా చేపట్టింది. సుమారు 500మిలియన్ డాలర్లతో మొదటి దశ పెట్టుబడితో ప్లాంటు ఏర్పాటునకు టెస్లా సిద్ధమవుతున్నది.

## వాహన అమ్మకాలు అంతంతే

న్యూఢిల్లీ, మార్చి 1: వాహన ఉత్పత్తి సంస్థలకు ఫిబ్రవరి నెల షాకిచ్చింది. ధరలను పెంచుతూ వాహన ఉత్పత్తి సంస్థలు తీసుకున్న నిర్ణయంతో కొనుగోలుదారులు వెనుకంజవేశారు. కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ అమ్మకాలు స్వల్పంగా పెరరగా.. హ్యుందాయ్, టాటా మోటర్స్ సేల్స్ భారీగా తగ్గాయి. వాహనాలకు డిమాండ్ పడిపోవడం వల్లనే తగ్గాయని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. మరోవైపు, మహీంద్రా, టయోటా కిర్లోస్కర్‌లు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకున్నాయి. దేశవ్యాప్తంగా రాజకీయ సవాళ్లు ఉన్నప్పటికీ వచ్చే ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో పన్ను సంస్కరణలు, లిక్విడిటీని పెంచడానికి తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్తులో డిమాండ్‌ను పెంచుతాయన్న విశ్వాసాన్ని హ్యుందాయ్ మోటర్ సీఈవో తరుణ్ గార్గ్ వ్యక్తంచేశారు.

**ఫిబ్రవరిలో వాహన విక్రయాలు**

| సంస్థ | 2025 | 2024 | వృద్ధి |
|---|---|---|---|
| మారుతి | 1,99,400 | 1,97,471 | స్వల్పంగా |
| హ్యుందాయ్ | 58,727 | 60,501 | -3 |
| మహీంద్రా | 83,702 | 72,923 | 15 |
| టయోటా | 28,414 | 25,220 | 13 |
| టాటా మోటర్స్ | 79,344 | 86,406 | -8 |
| కియా ఇండియా | 25,026 | 20,200 | 24 |
| హోండా కార్స్ | 10,323 | 13,078 | -21 |



## ఎన్టీపీసీ దూకుడు

న్యూఢిల్లీ: విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్టీపీసీ రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకు 400 బిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసింది. కేవలం ఈ మైలురాయికి చేరుకోవడానికి సంస్థ 335 రోజులు పట్టింది. అంతక్రితం ఏడాది కంటే 12 రోజులు ముందుగానే ఈ మైలురాయికి చేరుకోవడం విశేషం. 2023-24లో మార్చి 13న ఈ కీలక మైలురాయికి చేరుకున్నది. దేశీయంగా వినియోగిస్తున్న విద్యుత్‌లో నాలుగోవంతు సంస్థ ఉత్పత్తి చేస్తున్నదే కావడం విశేషం. ప్రస్తుతం సంస్థ 77 గిగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగివుండగా, మరో 29.5 గిగావాట్ల విద్యుత్ యూనిట్లు నిర్మాణదశలో ఉన్నాయి.

## ఎన్ఎండీసీ ఉత్పత్తి హైజంప్

హైదరాబాద్, మార్చి 1: ఖనిజ ఉత్పత్తిలో అగ్రగామి సంస్థ ఎన్ఎండీసీ ఆశాజనక పనితీరు కనబరిచింది. ఫిబ్రవరి నెలలో సంస్థ 4.62 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేయగా, 3.98 మిలియన్ టన్నుల ఖనిజాన్ని విక్రయించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో ఉత్పత్తైన ఖనిజంతో పోలిస్తే 18 శాతం వృద్ధిని కనబరిచినట్లు కంపెనీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. ఒక నెలలో ఇంతటి స్థాయిలో ఖనిజాన్ని ఉత్పత్తి చేయడం కూడా కంపెనీ చరిత్రలో ఇదే తొలిసారని ఆయన పేర్కొన్నారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు సంస్థ 40.49 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేయగా, 40.20 మిలియన్ టన్నుల ఖనిజాన్ని విక్రయించింది. వచ్చే ఏడాది నూతన గనులు అందుబాటులోకి వస్తుండటంతో ఖనిజ ఉత్పత్తి మరింత పెరిగే అవకాశాలున్నాయన్నారు.

## ఎంఎస్ఎంఈల మనుగడ ప్రశ్నార్థకం

- మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మారాలి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

హైదరాబాద్, మార్చి 1(నమస్తే తెలంగాణ): మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఎంఎస్ఎంఈలు, ఎస్ఎంఈలు మారాలని, లేదంటే రాబోయే రోజుల్లో వీటి మనుగడ ప్రశ్నార్థకంగా మారనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుత కృత్రిమ మేధ(ఏఐ) యుగంలోనూ పాత ఆలోచనలతో సంప్రదాయబద్ధంగా ముందుకెళ్తే తప్పా మనగడే ప్రశ్నార్థకంగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదని, ముఖ్యంగా పారిశ్రామికవేత్తలు ఈ విషయంలో అప్రమత్తంగా, ప్రజలు కోరుకుంటున్న విధంగా కొత్తగా ఆలోచించాలని ఆయన సూచించారు. ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన 'సమ్మిట్ ఆన్ ఫ్యూచర్-రెడీ ఇండస్ట్రీ ట్రాన్సఫర్మేషన్: ఇన్నోవేటింగ్ ఫర్ గ్రోత్ ఎఫిషియన్సీ అండ్ సెక్యూరిటీ(గ్రోథ్ ఎక్స్2025)' సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..టెక్నాలజీ రోజురోజుకి కొత్త పుంతలు తొక్కుతున్నదని, ముఖ్యంగా ఏఐ అందుబాటులోకి రావడంతో అన్ని రంగాల్లోనూ అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి..అలాగే అనేక సవాళ్లు కూడా ఎదురవుతున్నాయన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మన ఆలోచన తీరు మారాలని ఆయన పేర్కొన్నారు. సమాజం ఎదుర్కొంటున్న ఎన్నో సవాళ్లకు ఏఐ, క్వాంటమ్, మెషిన్ లెర్నింగ్ తదితర అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలను చూపొంచవచ్చని, ఆ దిశగా ఆవిష్కర్తలు కొత్తగా ఆలోచించాలని కోరారు. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. అభివృద్ధి విషయంలో ఇతర రాష్ర్టాలకు దీటుగా తెలంగాణ అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్నదని, సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో తెలంగాణ వృద్ధి రేటు 17.98 శాతం కాగా జాతీయ సగటు 8 శాతం మాత్రమేనని, ఐటీ రంగంలో తెలంగాణ సత్తా ఏంటో చెప్పడానికి ఇదే నిదర్శనమని మంత్రి అన్నారు.

**6 నుంచి చర్లపల్లిలో ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో**

ఈ నెల 6 నుంచి 8 వరకు చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో-2025 ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో 106 స్టాల్స్‌ను నెలకొల్పుతున్నట్లు, వాటిలో వివిధ పరిశ్రమలు తయారు చేస్తున్న ఉత్పత్తులను, సేవలను ప్రదర్శించనున్నట్లు వారు చెప్పారు.

## అల్ట్రాటెక్‌లో కేశోరాం విలీనం

పాలకుర్తి, మార్చి 1: ఆదిత్యా బిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్‌లో బీకే బిర్లా గ్రూపునకు చెందిన కేశోరాం సిమెంట్ విలీనమయ్యాయి. ఇందుకు సంబంధించి పెద్దపల్లి జిల్లాలోని పాలకుర్తి మండలం బసంత్‌నగర్ వద్ద ఉన్న యూనిట్‌లో ఇందుకు సంబంధించి అధికారిక కార్యక్రమం నిర్వహించారు. సుమారు 50 ఏండ్ల క్రితం ఉత్తర తెలంగాణలోని బసంత్ నగర్‌లో బీకే బిర్లా సిమెంట్ ప్లాంట్‌ను నెలకొల్పారు. ఆతర్వాతి క్రమంలో ఇక్కడే కేశోరాం సిమెంట్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం ఈ కేశోరాం సిమెంట్‌ను ఆదిత్యా బిర్లా గ్రూపు కొనుగోలు చేయడంతో ఇక నుంచి ఈ ప్లాంట్‌లో అల్ట్రాటెక్ సిమెంట్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి శనివారం ఈ యూనిట్‌లో కార్మికులు, గుర్తింపు కార్మిక సంఘం నాయకులు, ఉద్యోగులతో సమావేశం ఏర్పాటుచేసి, అధికారికంగా అల్ట్రాటెక్ లోగోను ఆవిష్కరించారు.

### పుల్ల నరేశ్ అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

భూపాలపల్లి రూరల్, మార్చి 1 : భూపాలపల్లి పట్టణంలో గత నెల 19న జరిగిన రాజలింగమూర్తి హత్య కేసులోని A9 పుల్ల నరేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నరేశ్‌కుమార్ శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన నిందితులను కూడా అతి త్వరలో పట్టుకొని రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు.

### టీజీ ఎండీసీ పీవో బదిలీ

**నూతన పీవోగా శ్రీకాంత్ నియామకం**

మహదేవపూర్(కాళేశ్వరం),మార్చి 1: జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాల టీజీ ఎండీసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ పీ రంగారెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ములుగు జిల్లాలో పీవోగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీకాంత్ ఇక్కడికి రానున్నారు. ఇసుక క్వారీల్లో జరుగుతున్న అక్రమాలు, వసూళ్ల దందాపై గతంలో ఇక్కడ పనిచేసిన పీవో రాములుపై విమర్శలు రావడంతో ఆయనపై సమగ్ర విచారణ చేపట్టిన అధికారులు ఆయనను నల్గొండ జిల్లాకు బదిలీ చేయగా ఆయన స్థానంలో నల్గొండ పీవో రంగారెడ్డి ఇటీవల బాధ్యతలను చేపట్టిన విషయం తెలిసిందే.కాగ ప్రస్తుతం పీవోగా విధులు నిర్వర్తిస్తున్న రంగారెడ్డిని నెల గడవక ముందే టీజీఎండీసీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేయడం చర్చనీయంగా మారింది.

### బాలికపై లైంగికదాడికి యత్నం

**నిందితుడిపై పోక్సో కేసు నమోదు**

గీసుగొండ, మార్చి 1 : మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులోని గణేశా ఈకోపెట్ పరిశ్రమ శివారులో నాలుగేండ్ల బాలికపై అదే పరిశ్రమలో పని చేస్తున్న వ్యక్తి లైంగికదాడికి యత్నించినట్లు సీఐ మహేందర్ తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన భార్యాభర్తలు గణేశా ఈకోపెట్ పరిశ్రమలో హెల్పర్లుగా పనిచేస్తున్నారు. వీరికి నాలుగేళ్ల పాప ఉండగా కంపెనీ వారు పార్కులో కార్మికుల కోసం కేటాయించిన గదుల్లో ఉంటున్నారు. శనివారం సాయంత్రం తల్లి ఇంట్లో ఉండగా బాలిక బయట ఆడుకుంటోంది. ఈ క్రమంలో అదే కంపెనీలో పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన రాజు కూల్‌డ్రింక్ తాగమని చిన్నారిని నమ్మించి, తన గదికి తీసుకెళ్లాడు. చిన్నారిపై లైగింక దాడికి యత్నం చేయడంతో బాలిక భయంతో ఏడువగా తల్లి విని అతడి గదిలోకి వెళ్లింది. అప్పటికే ఆ వ్యక్తి అసభ్యకరంగా ఉండడంతో చుట్టుపక్కల కార్మికులు అక్కడికి చేరుకొని, అతడిని చితకబాది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి వెళ్లే లోపు నిందితుడు పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు రాజుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్ తెలిపారు.

### సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి..

కమలాపూర్, మార్చి 1 : హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన వట్టెముల మనోజ్ సైబర్ నేరగాళ్ల వలకు చిక్కి పడి రూ.9.51లక్షలు పోగొట్టుకున్నట్లు సీఐ హరికృష్ణ శనివారం తెలిపారు. ఫిబ్రవరి 6న టెలిగ్రాం యాప్ ద్వారా బావి జోషి అనే అడ్రస్ నుంచి మెసేజ్ వచ్చింది. అందులో డబ్బులు జమ చేసి వారు చెప్పిన టాస్క్‌లు ఆడితే జమ చేసిన డబ్బులకు రెట్టింపు డబ్బులు వస్తాయని నమ్మించారు. సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మిన మనోజ్ విడుతల వారీగా రూ.9.51లక్షలు పంపించాడు. తిరిగి డబ్బులు జమ కాకపోవడంతో మోసపోయానని టోల్ ఫ్రీ నంబర్ 1930కి ఫిర్యాదు చేశాడు. అయినా డబ్బులు జమ కావడం లేదని గ్రహించి తిరిగి ఈ నెల ఒకటిన ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి పెద్దఎత్తున డబ్బులు పోగొట్టుకోవడం జిల్లాలో ఇదే మొదటిసారి.

### బైక్, బొలేరో ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

మరిపెడ, మార్చి 1: బైక్, బొలెరో ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన శనివారం బక్క రూప్లాతండా వద్ద జరిగింది. ఎల్లంపేట రెవెన్యూ బోట్యా తండాకు చెందిన డీఎస్ నవీన్ బైక్‌పై మరిపెడకు వస్తుండగా కోళ్ల లోడ్‌తో వరంగల్ వైపు వెళ్తున్న బొలెరో ఢీకొట్టింది. నవీన్‌కు తీవ్రగాయాలు కావడంతో 108లో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతున్నాడు.

# అక్రమ టోల్‌గేట్ తొలగింపు..

- డబ్బులు వసూలు చేయొద్దని హెచ్చరించిన అధికారులు
- 'దర్జాగా దారి దోపిడీ' కథనానికి స్పందించిన అధికారులు
- 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు

మానేరు వాగులో టోల్‌గేట్‌ను తొలగిస్తున్న అధికారులు

టేకుమట్ల, మార్చి 1 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం కలికోటపల్లి- పెద్దపల్లి జిల్లా ముత్తారం మండ లం ఓడెడ్ గ్రామాల మధ్యలోని మానేరు వాగులో అక్రమంగా నిర్వహిస్తున్న టోల్‌గేట్‌ను పోలీస్, రెవెన్యూ అధికారులు శనివారం ఉదయం తొలగించారు. 'దర్జాగా దారి దోపిడీ' అనే శీర్షికతో 'నమస్తే తెలంగాణ' మెయిన్‌లో శనివారం ప్రచురితమైన కథనానికి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్, పెద్దపల్లి కలెక్టర్ స్పందించారు. అనధికార టోల్ వసూలును ఆపేయాలని టేకుమట్ల, ముత్తారం పోలీసులు, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. దీంతో శనివారం ఉదయమే మానేరు వాగులోకి వెళ్లిన అధికారులు వాగులో ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌ను తొలగించా రు. ఎలాంటి వసూళ్లకు పాల్పడొద్దని, నిబంధనలకు వ్యతిరేకం గా వసూళ్లు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని టోల్‌గేట్ నిర్వాహకులను హెచ్చరించారు. నిన్నటి వరకు అనధికారికంగా వ సూలు చేసిన టోల్‌టాక్సీ బెడద తప్పడంతో అటు ముత్తారం, ఇటు టేకుమట్ల మండల ప్రజలతోపాటు వివిధ ప్రాంతాల వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ దందాను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన 'నమస్తే తెలంగాణ'కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

**రోజుకి రూ.50 చెల్లించేవాన్ని..**



టేకుమట్ల నుంచి ఒడేడ్‌కు ఆటో నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్న. టోల్‌టాక్సీ రోజుకు రూ.50 చెల్లించేవాడిని. అసలే ఆటోలకు గిరాకీ లేక ఇబ్బందిపడుతున్నాం. ప్రతి రోజూ డబ్బులు చెల్లించినా.. ఒక్క రోజు కూడా తక్కువ తీసుకునేవారు కాదు. మా బాధలను నమస్తే తెలంగాణ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో టోల్‌గేట్‌ను తొలగించారు. దీంతో టోల్‌బాధ తప్పింది. మళ్లీ టోల్ వసూలు చేయకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– కుమార్, ఆటో డ్రైవర్, వెలిశాల, టేకుమట్ల మండలం

# నమ్మించి కిడ్నీ తీసుకున్నారు..

- ఏడాదిన్నర తర్వాత వెలుగులోకి..
- ఉన్న కిడ్నీ దెబ్బ తిని చావుబతుకుల్లో చిట్టిబాబు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

కురవి, మార్చి 1: 'మా నాన్నకు మాయ మాటలు చెప్పి అవసరానికి కిడ్నీ తీసుకుని మోసం చేశారు.. నా తండ్రి ధరావ త్ చిట్టిబాబు చావుబతుకుల్లో ఉన్నాడు' అని అతడి కుమార్తె భూక్యా రమాదేవి శనివారం కురవి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. కురవి మండలం రాజోలు గ్రామ శివారు పొలంపల్లి తండాకు చెందిన ధరావత్ చిట్టిబాబుకు ఇద్దరు కుమారులు నితిన్, రాము, కుమార్తె రమాదేవి ఉన్నారు. భార్య విజయ 3 సంవత్సరాల క్రితం మృతిచెందింది. మండలంలోని నల్లెల్ల శివారు గాజతండాకు చెందిన ధరావత్ చంద్ర అనే వ్యక్తి సంవత్సరన్నర క్రితం కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా, గాజతండాకు చెందిన ధరావత్ సురేశ్, బానోత్ నవీన్‌తో కలిసి పొలంపల్లి తండాకు చెందిన ధరావత్ రవి వద్దకు వచ్చారు. నలుగురు కలిసి ధరావత్ చిట్టిబాబు ఇంటికి వెళ్లి కిడ్నీ ఇస్తే రెండు ఎకరాల భూమి, రెండు గుంటల భూమి (జాగ) కొనిచ్చి అందులో ఇల్లు కట్టిస్తామని, భవిష్యత్‌లో ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా తామే చూసుకుంటామని మాయమాటలు చెప్పి ఒప్పించారు. కుటుంబ సభ్యుల సమక్షంలో అగ్రిమెంటు రాసి, చిట్టిబాబును హైదరాబాద్‌కు తీసుకెళ్లి కిడ్నీ తీసి చంద్రకు అమర్చారు. ప్రస్తుతం చిట్టిబాబుకు ఉన్న ఒక్క కిడ్నీ కూడా చెడిపోయింది. ఆరోగ్యం బాగాలేదని, నాడు హామీ ఇచ్చిన వారి వద్దకు వెళ్లి అడిగితే మాకేం సంబంధం లేదని, దిక్కున్నచోట చెప్పుకోమంటున్నారని వాపోయాడు. తన తండ్రి చిట్టిబాబు ప్రస్తుతం అనారోగ్యంతో మహబూబాబాద్ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారని, చావుబతుకుల్లో ఉన్నాడని అతడి కూతురు తెలిపింది. నమ్మించి మోసం చేసిన నలుగురు చంద్ర, రవి, సురేశ్, నవీన్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నది.

చిట్టిబాబు

## రైతు కష్టం.. బుగ్గిపాలు

- మిర్చి కుప్పను తగులబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు
- సుమారు రూ.3.50లక్షల నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన

కృష్ణకాలనీ, మార్చి 1 : రైతు కష్టం బుగ్గిపాలైంది. గుర్తుతెలియని నిప్పుపెట్టడంతో ఆరుకాలం కష్టపడి పండించిన మిర్చి పంట మంటల్లో కాలిబూడిదైంది. ఈ ఘటన భూపాలపల్లి మండలం దూదేకులపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. బాధిత రైతు అజ్మీరా పరంసింగ్ కథనం ప్రకారం.. దూదేకులపల్లి గ్రామానికి చెందిన అజ్మీరా పరంసింగ్ తనకున్న 4 ఎకరాల్లో మిర్చిపంట పండించాడు. సుమారు 150 మంది కూలీలను పెట్టి పంట మొదటి క్రాప్ తీయించాడు. తెంపిన పంటను కల్లంలో ఆరబెట్టాడు. ఎండిన తర్వాత తాలు, మేలు కాయలను వేరు చేసి కుప్ప పోశాడు. మహాశివరాత్రి పండుగ సందర్భంగా మార్కెట్‌కు ఐదు రోజులు సెలవులు రావడంతో మిర్చి కుప్పపై తాటికమ్మలు కప్పి ప్రతిరోజూ కాపలాగా ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి ఏడు గంటల వరకు మిర్చి కుప్ప వద్ద కాపలా ఉన్న పరంసింగ్ ఇంటికి వెళ్లాడు. ఆ తర్వాత అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మిర్చి కుప్పకు నిప్పంటించడంతో పూర్తిగా కాలిపోయింది. తాను ఆరు కాలం కష్టపడి పండించిన పంటంతా అగ్గిపాలైందని రైతు గుండె లవిసేలా రోదించాడు. 80 నుంచి 90 బస్తాల మిర్చి కాలిబూడిదైందని, సుమారుగా రూ.3.50 లక్షల వరకు నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. తాను నిరుపేద కుటుంబానికి చెందిన వాడినని, అప్పులు చేసి పంట పండించానని, పంట చేతికొచ్చిన తర్వాత అప్పులు కడుదామనుకున్నట్లు తెలిపారు. ఇంతలోనే గుర్తు తెలియని వ్యక్తులు మిర్చి పంటను పూర్తిగా తగలబెట్టారని కన్నీరుమున్నీరుగా విలపించాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

కాలిపోయిన మిర్చి కుప్ప వద్ద రోదిస్తున్న రైతు అజ్మీరా పరంసింగ్

సీఎండీకి అవార్డు అందజేస్తున్న కంపెనీ సెక్రటరీలు

### ఎన్పీడీసీఎల్‌కు ది పీఎస్‌యూ లీడర్‌షిప్ అవార్డు

హనుమకొండ, మార్చి 1 : ఎన్పీడీసీఎల్‌కు ఇన్నోవేషన్ ఇన్ ఆపరేషనల్ ఎక్సలెన్స్ కింద ది పీఎస్‌యూ లీడర్‌షిప్ అవార్డు దక్కింది. శుక్రవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ కంపెనీ సెక్రటరీ వెంకటేశం, అసిస్టెంట్ సెక్రటరీ రమణారెడ్డి అందుకున్నారు. ఈ అవార్డును శనివారం నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డికి ఇన్‌చార్జి డైరెక్టర్లు, సీఈలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. వినియోగదారులకు వినూత్న సేవలు, సాంకేతికతను అందిపుచ్చుకుంటూ మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నందుకు ఈ అవార్డు దక్కిందని తెలిపారు. కొత్త సర్వీస్ కనెక్షన్లు, లైన్ షిఫ్టింగ్, ఫిర్యాదులు, దరఖాస్తుల స్థితిగతులు, చెల్లింపులు ఆన్‌లైన్ ద్వారా చేపడుతున్నామని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన పొలంబాట కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తున్నదని చెప్పారు. ఉద్యోగులకు మరింత తర్ఫీదు ఇచ్చేలా ట్రేనింగ్ తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. భారీ వర్షాలు, ఈదురు గాలులు, సాంకేతిక సమస్యల వల్ల ఏర్పడే విద్యుత్ అంతరాయాలను తగ్గించేందుకు ఈఆర్‌టీ (ఎమర్జెన్సీ పవర్ రీస్టోర్ టీం) వాహనాలను వాడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఇన్‌చార్జిలు అశోక్ కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, సీఈలు తిరుమల్‌రావు, బికం సింగ్, రాజుహన్, రవీంద్రనాథ్, వెంకటరమణ, కంపెనీ సెక్రటరీ వెంకటేశం పాల్గొన్నారు.

### సైకిల్‌ను ఢీకొన్న క్రేన్.. తండ్రీకొడుకుల మృతి

రాజేశ్వర్‌రావు, తండ్రి (ఫైల్)



వికాశ్‌రావు, కుమారుడు (ఫైల్)

ఎల్కతుర్తి, మార్చి 1 : మండలంలోని కోతులనడుమ గ్రామ శివారులో సైకిల్‌పై వెళ్తున్న తండ్రీకొడుకులను హైడ్రా క్రేన్ ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఎల్కతుర్తి ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం...కోతులనడుమ గ్రామానికి చెందిన తంగెడ రాజేశ్వర్‌రావు(65), అతడి చిన్న కొడుకు దివ్యాంగుడు తంగెడ వికాస్‌రావు(31)ను తీసుకొని సైకిల్‌పై వల్భాపూర్ గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్తున్నారు. హనుమకొండ వైపు వస్తున్న హైడ్రా క్రేన్ వీరిని సైకిల్ వెనక నుంచి ఢీ కొట్టింది. దీంతో సైకిల్‌పై ఉన్న తండ్రి, కొడుకుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. గమనించిన స్థానికులు బంధువులతోపాటు ఎల్కతుర్తి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎల్కతుర్తి ఎస్సై ప్రవీణ్‌కుమార్ వివరాలు సేకరించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడు రాజేశ్వర్‌రావు పెద్ద కొడుకు సాగర్‌రావు ఫిర్యాదు మేరకు క్రేన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.